క్లుప్తంగా

ఏఎన్ఎం మృతికి సంతాపం



కాటారం: స్థానిక గిరి జన సంక్షేమ గురుకుల బాలుర కళాశాలలో ఏఎన్ఎంగా విధులు నిర్వర్తిస్తున్న పావని గుండెపోటుతో మృతి చెందగా పాఠశాల, కళాశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు సోమవారం మౌనం పాటించి సంతాపం ప్రకటించారు. పావని మృతి పట్ల ఆర్సీఓ రాజ్యలక్ష్మి విచారం వ్యక్తం చేశారు. సొసైటీ తరఫున పావని అంత్యక్రియల నిమిత్తం రూ.20 వేలు ప్రిన్సిపాల్ రాజేందర్, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్, జూనియర్ అసిస్టెంట్ జక్కు వీరయ్య అందజేశారు.

జెడ్పీ చైర్‌పర్సన్‌కు సన్మానం



మల్హర్: మండలంలోని తాడిచర్ల ఎంపీడీఓ కార్యాలయంలో జయశంకర్ భూపాలపల్లి జెడ్పీ చైర్మన్ జక్కు శ్రీహర్షిణి రాకేష్‌ను ఎంపీపీ చింతలపల్లి మల్హల్‌రావు, ఎంపీడీఓ నర్సింహామూర్తి సోమవారం శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ రావుల కల్పన మొగిళి, సిబ్బంది పాల్గొన్నారు.

మైనార్టీ సెల్ జిల్లా ఇన్‌చార్జ్‌గా ఖాజాపాషా

ఏటూరునాగారం : బీఆర్ఎస్ జిల్లా మైనార్టీ సెల్ ఇన్‌చార్జ్‌గా మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకుడు ఖాజాపాషాను ఎంపిక చేసినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు, జెడ్పీ చైర్మన్ జగదీష్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన నాయకులకు, జెడ్పీ చైర్మన్ జగదీష్‌కు ఖాజాపాషా కృతజ్ఞతలు తెలిపారు.

భూమిపూజ



వాజేడు : గ్రామంలో బొడ్రాయిని ఏర్పాటు చేయడానికి మండల పరిధిలోని ఎడ్జర్లపల్లి కొత్తూరులో సోమవారం భూమి పూజ చేశారు. గ్రామంలో బొడ్రాయి, మా లక్ష్మి, ఆంజనేయ స్వామి విగ్రహం, ముత్యాలమ్మ విగ్రహాలను నిర్మించడానికి గ్రామస్తులు అందరు కలిసి భూమి పూజను నిర్వహించారు.

పింఛన్ల అందజేత



ఏటూరునాగారం : ఆసరా లబ్ధిదారులకు సకాలంలో పింఛన్లు ఇస్తున్నట్లు బీపీఎం వహీద్ తెలిపారు. సోమవారం స్థానిక గ్రామపంచాయతీ కార్యాలయంలో బీపీఎం వహీద్, పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ రవీందర్ పింఛన్‌లు అందజేశారు. అయితే కొంత మంది వృద్ధులకు వేలిముద్రలు పడకపోవడంతో వారికి గ్రామ పంచాయతీకి పిలిపించి అందిస్తున్నట్లు తెలిపారు.

కరాటేలో ప్రతిభ చాటాలి



ఏటూరునాగారం: విద్యార్థులు కరాటేలో ప్రతిభ చాటాలని ఐటీడీఏ పీఓ అంకిత్ అన్నారు. సోమవారం స్థానిక పీఓ ఛాంబర్‌లో సూర్య షోటోకాన్ అకాడమీ ఆధ్వర్యంలో 5వ రాష్ట్ర స్థాయి కరాటే టోర్నమెంట్ పోస్టర్‌ను పీఓ ఆవిష్కరించారు. సూర్య షోటోకాన్ కరాటే అకాడమి ఆధ్వర్యంలో నిర్వహించనున్న తెలంగాణ రాష్ట్ర స్థాయి పోటీలను ఫిబ్రవరి 26 నుంచి మండల కేంద్రంలోని గిరిజన భవన్‌లో నిర్వహించనున్నట్లు సురేష్ మాస్టర్ తెలిపారు. టోర్నమెంట్‌కు సుమారు 600 మంది పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో ఇర్ప బాలాజీ, గొంది హనుమంత్, సంతోష్, రమ్యశ్రీ, ధనలక్ష్మి, సుభాష్ పాల్గొన్నారు.

బెంచీల బహూకరణ

వెంకటాపురం(కె): మండల పరిధిలోని ఆలుబాక పాఠశాలకు సింజెంటా మొక్కకొన్న కంపెనీ ఆధ్వర్యంలో బెంచీలను బహూకరించారు. ఈ బెంచీలను కంపెనీ డీలర్ వేణు అందజేశారు. పాఠశాలకు బెంచీలను అందజేయటంపై ఉపాధ్యాయులు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేశారు.

కాషాయ జెండా ఎగరడం ఖాయం

● బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న చందుపట్ల కీర్తిరెడ్డి

మొగుళ్లపల్లి: భూపాలపల్లి గడ్డపై కాషాయజెండా ఎగురవేయడం ఖాయమని బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి చందుపట్ల కీర్తిరెడ్డి అన్నారు. సోమవారం పార్టీ మండల శాఖ ఆధ్వర్యంలో కార్యవర్గ సమావేశాన్ని మండల అధ్యక్షుడు చెవ్వ శేషగిరి అధ్యక్షతన నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఆమె హాజరై మాట్లాడుతూ నియోజకవర్గంలో బీజేపీ బూతు స్థాయిలోని కార్యకర్తలే పట్టుకొమ్మలని సైనికుల్లాగా పనిచేసి భూపాలపల్లిలో బీజేపీ జెండాఎగురవేయాలని అన్నారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకువెళ్లి ప్రజలకు వివరించాలన్నారు. తెలంగాణ ప్రభుత్వ వైఫల్యాలను ఈనెల 10 నుంచి 25 వ వరకు నిర్వహించే కార్నర్ సమావేశాల్లో ఎండగట్టాలన్నారు. కార్నర్ మీటింగ్ కార్యక్రమాన్ని విజయంతం చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చదువు రామచంద్రరెడ్డి, భూపాలపల్లి నియోజకవర్గ కన్వీనర్ మోరే రవీందర్ రెడ్డి, పర్లపల్లి ఎంపీటీసీ దొంగల రాజయ్య, జిల్లా కార్యదర్శి అన్నం శ్రీనివాస్, జిల్లా నాయకులు పులి రత్నాకర్‌రెడ్డి, మునిగంటి మల్లారెడ్డి, నాంపల్లి చంద్రమోహన్, మండల ప్రధాన కార్యదర్శులు మోరే వేణుగోపాల్ రెడ్డి, బండారి శ్రీనివాస్, మండల ఉపాధ్యక్షుడు పోతుగంటి సాయిలు, పెండ్లి మల్లారెడ్డి బల్గూరి కిషన్ రావు, పీఏసీఎస్ డైరెక్టర్ తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

కార్పొరేట్‌కు దీటుగా నాణ్యమైన విద్య



ప్రచారం నిర్వహిస్తున్న ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు

టేకుమట్ల: ఆదర్శ పాఠశాలలో కార్పొరేట్‌కు దీటుగా ఆంగ్ల మాధ్యమంలో నాణ్యమైన విద్యనందిస్తున్నామని మొగుళ్లపల్లి మండలం కొర్కిశాల ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయులు గోపు కొమురెల్లి, అందె కుమార్ అన్నారు. సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ హైమావతి ఆదేశాల మేరకు మండలంలోని కుందనపల్లి, బండపల్లి, ఎంపేడు, వెల్లంపల్లి గ్రామాల్లో ఎంపీటీసీ సంగి రవితో కలిసి పాఠశాలలో ప్రవేశాల కోసం ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 6వ తరగతిలో 100 సీట్లు ఉన్నాయని, 6వ తగగతితో పాటు 7, 8, 9, 10 తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీ కోసం ఈ నెల 15 లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. పరకాల నుంచి నుంచి దుబ్యాల వరకు ఆర్టీసీ బస్సు సౌకర్యం ఉందన్నారు.

లక్కాకుల రమేష్‌కు సేవారత్న అవార్డు



అవార్డు అందుకుంటున్న రమేష్

చిట్యాల : మండలంలోని దూత్‌పల్లికి చెందిన లక్కాకుల రమేష్‌కు భారత స్ఫూర్తి సేవారత్న నేషనల్ అవార్డు లభించింది. బీసీ సంఘం ఆధ్వర్యంలో సామాజిక సేవలు చేస్తున్న రమేష్‌కు ఫిబ్రవరి 4న హైద్రాబాద్‌లోని సరస్వతీ ఏషియన్ వేదిక్‌లో జరిగిన కార్యక్రమంలో ఆయనకు అవార్డును అందజేశారు. . స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ ఇండియా ఫౌండర్, చైర్మన్ లయన్ డాక్టర్ ఆకుల రమేష్, ఉస్మానియా యూనివర్సిటీ డీన్ లా కాలేజ్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ గాలి వినోద్ కుమార్, స్ఫూర్తి సర్వీసెస్ సొసైటీ నేషనల్ బోర్డు కమిటీ మెంబర్, భారతదేశానికి చెందిన భూటాన్ దేశపు ఎంబసీ రంజిత్ కుమార్ ఈ అవార్డును ప్రదానం చేశారు.

నష్టపరిహారం ఇప్పించాలి



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నిర్వాసితులు

కాటారం: చిన్న కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో భాగంగా గారెపల్లి పంప్‌హౌస్, రిజర్వాయర్ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోయిన నిర్వాసితులకు పరిహారం చెల్లించాలని కోరుతూ సోమవారం జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రాకు రైతులు వినతిపత్రం సమర్పించారు. 2009లో ప్రాజెక్ట్ కోసం భూ సేకరణ చేసి పనులు ప్రారంభం చేశారు. గారెపల్లిలో పంప్‌హౌస్, రిజర్వాయర్ నిర్మాణం 385 ఎకరాల భూమిని సర్వే చేసి ప్రభుత్వం తీసుకుందని వారు పేర్కొన్నారు. సుమారు 70 ఎకరాల భూమికి ఇంకా నష్టపరిహారం అందక నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. భూమి సాగు చేసుకునే అవకాశం లేక, పరిహారం అందక రోడ్డున పడిపోయామని నిర్వాసితులు కలెక్టర్‌కు విన్నవించారు. అప్పుల బాధతో తాము ఆత్మహత్య చేసుకునే పరిస్థితి నెలకొందని గోడు వెల్లబోసుకున్నారు. పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలని వేడుకున్నారు. వినతిపత్రం అందించిన వారిలో చీమల రాజు, మాచెర్ల రాజేందర్, పల్నాటి బలరాం, రాంచందర్, బాపు, రజిత, రాజశేఖర్, మధునమ్మ, వెంకటస్వామి, రాజమ్మ తదితరులు ఉన్నారు.

రేపు విద్యుత్ వినియోగదారుల సదస్సు

మహదేవపూర్: మండల కేంద్రంలో ఈనెల 8న విద్యుత్ సబ్‌స్టేషన్ ప్రాంగణంలో వినియోగదారుల సదస్సు నిర్వహించనున్నట్లు డీఈ నాగరాజు తెలిపారు. వినియోగదారుల సదస్సులో తమ సమస్యలను ప్రజల విద్యుత్ పునరుద్ధరణ, కాలిపోయిన ట్రాన్స్‌ఫార్మర్లను మార్చడం, ఓల్టేజ్ ఎక్కువ హెచ్చుతగ్గులను డిస్ట్రిబ్యూషన్ వోల్టేజ్ ఎక్కువ పెంచడం, లోపాలు, మీటర్లను మార్చడం, నూతన సర్వీస్‌లు మంజూరు, అదనపు లోడు పునరుద్ధరణ, పేరు మార్పు, విద్యుత్ వాడకంలో హెచ్చుతగ్గులో కేటగిరి మార్పు, సర్వీసు రద్దు తదితర అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించి పరిష్కరించనున్నట్లు తెలిపారు.

అంబేడ్కర్ విగ్రహానికి జర్నలిస్టుల వినతి



దీక్షలను ప్రారంభిస్తున్న బందు సాయిలు

భూపాలపల్లి అర్బన్: జర్నలిస్టులకు కేటాయించిన ఇంటి స్థలాల రద్దుకు కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వులను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ సోమవారం జిల్లాకేంద్రంలోని జర్నలిస్టులు అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి నిరసన వ్యక్తంచేశారు. అనంతరం అంబేద్కర్ సెంటర్ నుంచి గణేష్‌చౌక్ మీదుగా జర్నలిస్టు కాలనీలో దీక్ష శిబిరం వరకు బైక్‌ర్యాలీ నిర్వహించారు. జర్నలిస్టుల దీక్షలు సోమవారం నాటికి 5వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు సీపీఎం జిల్లా కార్యదర్శి బందు సాయిలు, సీపీఐ ఎంఎల్ జిల్లా కార్యదర్శి మారెపల్లి మల్లేష్, బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బీమనాధుని సత్యనారాయణ, బీజేపీ జిల్లా సోషల్ మీడియా ఇన్‌చార్జ్ పోషల రాజు, టీయూడబ్ల్యూజే (హెచ్–143) రాష్ట్ర కార్యదర్శి రాజ్‌నారాయణ, తీన్మార్ మల్లన్న టీమ్ జిల్లా కన్వీనర్ రవిపటేల్ సంఘీభావం తెలిపారు. కలెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులను రద్దుచేసే వరకు పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని తెలిపారు.

హైదరాబాద్‌కు తరలిన నాయకులు

భూపాలపల్లి అర్బన్: సింగరేణిలో గుర్తింపు ఎన్నికలు నిర్వహించాలని ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన చలో ఆర్ఎల్‌సీ కార్యాలయ ముట్టడికి భూపాలపల్లి ఏరియా నాయకులు వెళ్లినట్లు యూనియన్ డిప్యూటీ జనరల్ సెక్రటరీ కొరిమి రాజ్‌కుమార్ తెలిపారు. తరలిన వారిలో మధు, విజేందర్, శ్రీనివాస్, పోశం, నారాయణ, తిరుపతి, కొమరయ్యలు ఉన్నారు.

నిత్యావసర సరుకుల అందజేత



నిత్యావసర సరుకులను అందజేస్తున్న ప్రవీణ్

టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని జూబ్లీనగర్‌లో ఇటీవల ప్రమాదవశాత్తు ఇళ్లు దగ్ధం కావడంతో నిరాశ్రయులైన బాధితులు పర్ష లక్ష్మీతో పాటు ఆమె కుటుంబ సభ్యులను జీఎంఆర్ ట్రస్టు చైర్మన్ గండ్ర గౌతమ్‌రెడ్డి స్ఫూర్తితో సోమవారం బీఆర్ఎస్ మండల యువజన నాయకులు బొజ్జం ప్రవీణ్ పరామర్శించి నెలకు సరిపడా నిత్యావసర సరుకులను అందించారు. ఆయన వెంట సర్పంచ్ జంగిటి నరేష్, ఎంపీటీసీ వెంకన్న, యువజన నాయకులు పెండెల శంకర్, బాలాజీ రాజు తదితరులు ఉన్నారు.

గుడుంబా స్థావరాలపై దాడులు



బెల్లంపానకాన్ని ధ్వంసం చేస్తున్న సిబ్బంది

మల్హర్ : మండలంలోని దుబ్బపేటలో గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. గ్రామంలోని రహస్య ప్రదేశంలో అక్రమంగా నిల్వ ఉంచిన 400 లీటర్ల బెల్లం పానకం పారబోసి, డ్రమ్ములను పగులగొట్టినట్లు ఎక్సైజ్ సీఐ ప్రశాంతి తెలిపారు. గుడుంబా తయారు చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. దాడుల్లో సిబ్బంది పాల్గొన్నారు.

ఎక్స్‌గ్రేషియా వద్దు..ఉద్యోగం కావాలి



ఉద్యోగాలు ఇప్పించాలని పీఓకు అర్జీపెడుతున్న జీసీసీ బాధితులు

ఏటూరునాగారం: జీసీసీలో 25 ఏళ్ల క్రితం మా తండ్రులు జీసీసీలో పనిచేశారని, వారికి ఎక్స్‌గ్రేషియా కింద వచ్చిన డబ్బులను తీసుకోబోమని, తమకు ఉద్యోగాలు కావాలని బాధిత కుటుంబాలు కొండయ్య, జయప్రకాష్, రమేష్, రమక్క పీఓకు మొర పెట్టుకున్నారు. సోమవారం ఐటీడీఏలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఐటీడీఏ పరిధిలోని గిరిజన సహకార సంస్థ(జీసీసీ) పరిధిలో పనిచేసే వారికి సుమారు 23 మందికి ఎక్స్‌గ్రేషియా కింద ప్రభుత్వం రూ.9 లక్షలు మంజూరు చేసిందన్నారు. ఇందులో ఒకరు కన్నాయిగూడెం మండలం సర్వాయికి చెందిన ఒక్కరూ మాత్రమే తీసుకోగా మిగతా వారు ఎవరు తీసుకోలేదని తెలిపారు. జీసీసీ నుంచి ఉద్యోగాలు వస్తాయని ఎంతో ఆశపడి ఇన్ని సంవత్సరాలు ఎదురు చూశామన్నారు. ఇప్పుడు ఎక్స్‌గ్రేషియా ఇస్తే ఎలా అని డీఎం ప్రతాప్‌రెడ్డిని బాధితులు ప్రశ్నించారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని ఐటీడీఏ పీఓ అంకిత్, జీసీసీ డీఎం ప్రతాప్‌రెడ్డికి అందజేసి ఉద్యోగాలు ఇప్పించాలని వేడుకున్నారు.

చెక్కు అందజేత

రాష్ట్ర ప్రభుత్వం గిరిజన సహకార సంస్థ (జీసీసీ) ఏటూరునాగారం డివిజన్ పరిధిలోని జీసీసీ సొసైటీల్లో గతంలో ఉద్యోగం చేస్తూ చనిపోయిన బాబుకు వచ్చిన రూ.75వేల ఎక్స్‌గ్రేషియా చెక్కును సోమవారం ఐటీడీఏ కార్యాలయంలో అతడి కుమారుడు ఈశ్వర్‌కు పీఓ అంకిత్ అందజేశారు.

హామీలను అమలు చేయాలి

భూపాలపల్లి రూరల్: గిరిజనులకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని సేవాలాల్‌సేన జిల్లా అధ్యక్షుడు భుక్యా సురేష్ డిమాండ్‌చేశారు. సేవాలాల్ సేన ఆధ్వర్యంలో సోమవారం కలెక్టరేట్ ఎదుట ఒక రోజు దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సురేష్‌నాయక్ మాట్లాడుతూ ఫిబ్రవరి 15న సేవాలాల్ సంత్ జయంతి నిర్వహణకు రూ.10లక్షలు తక్షణమే కేటాయించాలని డిమాండ్ చేశారు. ఆ రోజున అధికారికంగా సెలవు ప్రకటించాలన్నారు. గిరిజనుల సమస్యల పరిష్కారం కోసం ఎస్టీ కమిషన్ ఏర్పాటు చేయాలని కోరారు. గిరిజన బంధు అమలుకు వెంటనే జీఓ జారీచేయాలని చెప్పారు. జిల్లాలో గిరిజన విశ్వ విద్యాలయం ఏర్పాటు చేయాలని కోరారు. ఈ దీక్షలో సేవాలాల్ సేనరాష్ట్ర నాయకులు రఘురాం, మహిళా జిల్లా అధ్యక్షురాలు శారదాబాయి, నాయకులు వాలునాయక్, మధుకర్‌నాయక్, శ్రీధర్, వివిధ మండలాల అధ్యక్షులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఆలయ పునర్నిర్మాణానికి విరాళాల సేకరణ



దంపతులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ

కాటారం: స్థానిక గారెపల్లి శ్రీ అభయాంజనేయస్వామి ఆలయం పునర్నిర్మాణంలో భాగంగా దాతలు విరాళాలు అందజేస్తున్నారు. మండల కేంద్రానికి చెందిన చేకూర్తి జల్మయ్య–పద్మ దంపతులు రూ.1,01,116 విరాళంగా ఆలయ కమిటీ సభ్యులకు సోమవారం అందజేశారు. దాత జల్మయ్య దంపతులను ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ కొట్టె శంకరయ్య, కమిటీ ప్రతినిధులు జక్కు మొగిలి, కొట్టె శ్రీహరి, కొట్టె ప్రభాకర్, చల్ల జక్కిరెడ్డి, చీమల రాజు, రామన్న, కొంరయ్య తదితరులు పాల్గొన్నారు.

భూమి సేకరించొద్దు



తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న రైతులు

మల్హర్ : మండలంలోని తాడిచర్ల ఎస్సీ కాలనీ, కాపురం గ్రామంలోని నిర్వాసితులకు ఆర్అండ్ఆర్ ప్లాట్స్ కేటాయింపులో భాగంగా తాడిచర్ల శివారులోని తమ భూములు సేకరించొద్దని రైతులు తూండ్ల రాజయ్య, సమ్మయ్య, తిరుపతిలో తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ శ్రీనివాస్‌కు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూ సేకరణ నిమిత్తం తమకు ఎలాంటి సమాచారం లేకుండా ఈనెల 3న ఒక పత్రికలో ప్రాథమిక నోటిఫికేషన్ జారీ చేసినట్లు ఆందోళన వ్యక్తం చేశారు. మా కుటుంబానికి జీవనోపాధి కల్పించే భూములు లాక్కుంటే తాము రోడ్డున పడే పరిస్థితి ఉంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. భూ సేకరణను ఉన్నతాధికారులు విరమించుకోవాలని జిల్లా ఉన్నతాధికారులకు విజ్ఞప్తి చేశారు.

టీచర్ పోస్టులు రద్దు చేయడం సరికాదు

భూపాలపల్లి అర్బన్ : జిల్లాలో విద్యార్థుల సంఖ్య తక్కువగా ఉందనే కారణంతో కొన్ని పాఠశాలలు, ఉపాధ్యాయుల పోస్టులను రద్దు చేసే ఆలోచనను ప్రభుత్వం విరమించుకోవాలని డెమోక్రటిక్ టీచర్స్ ఫెడరేషన్ జిల్లా శాఖ అధ్యక్ష, కార్యదర్శులు రమణారెడ్డి, తిరుపతి డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలోని డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలోని అనేక ప్రాథమిక పాఠశాలల్లో ఏకోపాధ్యాయుడు ఉన్నారని, ఒక్క ఉపాధ్యాయుడే ఐదు తరగతులకు 18 పీరియడ్లు ఎలా బోధన చేస్తాడని ప్రశ్నించారు. ఒకవైపు తరగతులకు సరిపోను ఉపాధ్యాయులు లేక విద్యావ్యవస్థ కుంటుపడుతుంటే మరోవైపు ఈ బదిలీలు, ప్రమోషన్స్ ప్రక్రియలో భాగంగా జిల్లాలో సుమారు 22 పాఠశాలలు, 30 టీచర్ పోస్టులను రద్దు చేసే యోచనలో ఉందని దుయ్యబట్టారు. కార్యక్రమంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, వీరేశం, వీరన్న, భోజ్యానాయక్, కరుణాకర్‌రావు, మధు, సారంగపాణి, రాజేశం, సంపత్, మోహిన్‌లు పాల్గొన్నారు.

పదవీ బాధ్యతలు స్వీకరించిన సర్పంచ్



సర్పంచ్ శంకరయ్యకు ఆర్డర్ ప్రతిని అందజేస్తున్న కార్యదర్శి కల్పన

భూపాలపల్లి రూరల్ : గత ఆరునెలల క్రితం వివిధ ఆరోపణలతో సస్పెండైన మండలంలోని గొర్లవీడు గ్రామ సర్పంచ్ తాటికంటి శంకరయ్య సోమవారం గ్రామ సర్పంచ్‌గా మళ్లీ బాధ్యతలు స్వీకరించారు. ఆరునెలల క్రితం పలు ఆరోపణల నేపథ్యంలో కలెక్టర్ భవేష్ మిశ్రా సస్పెండ్ చేసి ఉపసర్పంచ్‌కు బాధ్యతలు అప్పగించారు. విచారణ అనంతరం కలెక్టర్ శంకరయ్యకు మళ్లీ పదవి బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సోమవారం గ్రామ కార్యదర్శి కల్పన సర్పంచ్ శంకరయ్యకు ఆర్డర్ ప్రతిని అందించారు. ఈ సందర్భంగా శంకరయ్య అధికారులకు, ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, వరంగల్ జెడ్పీ చైర్‌పర్సన్ జ్యోతికి, రాష్ట్ర వికలాంగుల చైర్మన్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డికి, పార్టీ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.

‘మోదీ’ లక్ష్యం ప్రైవేటీకరణ



ఎస్బీఐ ఎదుట నిరసన వ్యక్తం చేస్తున్న నాయకులు

కాటారం: దేశ ప్రధాని మోదీ దేశాన్ని ప్రైవేటుపరం చేయడానికి తీవ్రంగా కృషి చేస్తున్నారని ఎంపీపీ పంతకాని సమ్మయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వేమునూరి ప్రభాకర్‌రెడ్డి ఆరోపించారు. స్థానిక ఎస్బీఐ ఎదుట కాటారం సబ్‌డివిజన్ పరిధిలోని కాంగ్రెస్ శ్రేణులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రధాని మోదీ తన స్నేహితుడికి సహాయం చేయాలనే ఆతృతతో దేశాన్ని దోపిడీ చేసి పెడుతున్నారని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మహిళా మండల అధ్యక్షురాలు జాడి మహేశ్వరీ, వైస్ ఎంపీపీ చీర్ల తిరుమల, టీపీసీసీ మెంబర్ కిష్టయ్య, కోసరి భాస్కర్, నాయకులు గద్దల రమేష్, దేవేందర్‌రెడ్డి, రఘురాం, ఎంపీటీసీ రూపా ఓంసింగ్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కంటివెలుగు పరీక్షలు ప్రారంభం



కంటి పరీక్షలు నిర్వహిస్తున్న వైద్య సిబ్బంది

కాటారం: మండలంలోని రేగులగూడెంలో ప్రభుత్వ పాఠశాల ఆవరణలో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన కంటివెలుగు కార్యక్రమాన్ని సర్పంచ్ దోమ రాహుల్ రెడ్డి సోమవారం ప్రారంభించారు. కంటి వ్యాధితో బాధపడుతున్న వ్యాధిగ్రస్తులు కంటి పరీక్షలు చేయించుకోవాలని సూచించారు. మొదటి రోజులో భాగంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించారు. కార్యక్రమంలో వైద్యాధికారులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న జెడ్పీటీసీ

చిట్యాల: మండలంలోని నవాబ్‌పేటకు చెందిన లబ్ధిదారులకు మంజూరైన కల్యాణలక్ష్మి చెక్కులను జెడ్పీటీసీ గొర్రె సాగర్, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఆరెపల్లి మల్లయ్య అందించారు. కార్యక్రమంలో సర్పంచ్ కసిరెడ్డి సాయిసుధా రత్నాకర్‌రెడ్డి, గ్రామ శాఖ అధ్యక్షులు సాదరాజు, పీఏసీఎస్ డైరెక్టర్ కసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, నాయకులు బొమ్మ శంకర్, పర్లపెల్లి భద్రయ్య, ప్రవీణ్, సుమలత, శ్రీకాంత్, మాజీ ఎంపీటీసీ ఆకాశం ఓదెలు తదితరులు పాల్గొన్నారు. అనంతరం ఇటీవల చనిపోయిన గొరెంకల సదయ్య కుటుంబాన్ని, రోడ్డు ప్రమాదంలో గాయపడిన పంచాయతీ కార్యదర్శి చిలుమల ప్రభాకర్‌లను వారు పరామర్శించారు.

విద్యార్థుల మధ్య ఘర్షణ

భూపాలపల్లి అర్బన్ : జిల్లా కేంద్రంలోని మైనారిటీ బాలుర గురుకుల పాఠశాలలో మూడు రోజుల క్రితం ఘర్షణ చోటు చేసుకున్న విషయం ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పాఠశాలలకు చెందిన రెండు వర్గాలకు విద్యార్థులు కొట్టుకున్నట్లు తెలిసింది. దెబ్బలు తగిలిన విద్యార్థుల తల్లిదండ్రులు రెండు రోజుల క్రితం పాఠశాలలో ఆందోళన చేసినట్లు సమాచారం. దీంతో సోమవారం పాఠశాల ప్రిన్సిపాల్ రజిత ఆధ్వర్యంలో ఆర్ఎల్‌సీ, మైనారిటీ అధికారులు విద్యార్థుల తల్లిదండ్రులను పిలిచి కౌన్సిలింగ్ ఇచ్చారు.